విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

# సచివాలయ సిబ్బందితో తలుపులు తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

విశాలాంధ్ర, కూచిపూడి : అంగన్వాడీ సిబ్బంది తమ డిమాండ్ల సాధనకైగత మూడు రోజులుగా సమ్మెబాట పట్టడంతో మూసుకున్న అంగన్వాడి తలుపులు నాలుగో రోజు అయిన శుక్రవారం సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో తెరుచుకున్నాయి. మొవ్వ మండలంలోని 16 సచివాలయ పరిధిలో గల 67 కేంద్రాలలో 61 కేంద్రాలకుఆయా సచివాలయాల సిబ్బందిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా మండలంలోని మొవ్వలో రెండు, పెదపూడి, పెద ముత్తేవి, గూడపాడు, కొండవరంలలో ఒక్కొక్క కేంద్రానికి సంబంధించినసిబ్బంది సాంకేతిక కారణాల మూలంగా సమ్మెలో పాల్గొనలేదని సి.డి.పి. ఓ.పి. భానుమతి వెల్లడించారు. ఒక్కొక్క కేంద్రానికి సచివాలయ ఉద్యోగితో పాటు ఇద్దరు వాలంటీర్లను నియమించారు. తెరుచుకొన్నపలు కేంద్రాలను ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు, మండల తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సిడిపిఓ పి భానుమతి పరిశీలించి ఫీడింగ్ పంపిణీ చేయించారు. కూచిపూడి సచివాలయ పరిధిలో గల 5 అంగన్వాడి కేంద్రాలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి వినోద్, గ్రేడ్ 5 కార్యదర్శి కే ఆంజనేయులు, మహిళా పోలీస్ జి భార్గవి, డిజిటల్ అసిస్టెంట్ అంజలి, బార్లపూడి కేంద్రానికి వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్

పి ఉమామహేశ్వరరావులను కేటాయించారు. ఈ కేంద్రాలలో స్టాక్ వివరాలను వీఆర్వో ఎం ఖాసిం గ్రేడ్ వన్ కార్యదర్శిలలో నమోదు చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాలు సజావుగా నిర్వహించాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్**

విశాలాంధ్ర, మచిలీపట్నం : అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తల సమ్మె నేపథ్యంలో ఆ కేంద్రాలను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు సహాయకులు సమ్మెలో పాల్గొంటున్న దృష్ట్యా అంగన్వాడి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అంగన్వాడీ కేంద్రాలను సజావుగా నడిపించాలన్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి, జడ్పీ సీఈవో, డీఈవో, డిఎస్ఓ, డిఆర్డిఏ పిడి, డి ఎం హెచ్ఓ లను పర్యవేక్షణ అధి కారులుగా నియమించామన్నారు. అలాగే డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, డిఎల్‌డివోలు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ పరిశీలిస్తూ మండల స్థాయి బృందంతో సమన్వయ పరుచుకుని ఎప్పటికప్పుడు ఏర్పాట్లు సజావుగా జరుగుతున్నాయా లేదా గమనించాలన్నారు. ఉన్నతాధి కారులకు ఆ సమాచారం చేరవేయాలన్నారు. డిఎల్డిఓ నోడల్ అధికారిగా

వ్యవహరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు తాసిల్దారు మున్సిపల్ కమిషనర్ ఎంఈఓ సిడిపిఓలు పిడిఎస్ డిటి బృందంగా ఏర్పడి ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ పెద్ది రోజా, ఐసిడిఎస్ పిడి సువర్ణ, డిఎస్ఓ పార్వతి, డిఈఓ తహేర సుల్తానా, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్త ఆకలి కేకలు కనిపించవా?

**లివర్ల కుమార్ రాజా ఆగ్రహం**

విశాలాంధ్ర కూచిపూడి : ఎన్నికల ముందు అంగన్వాడీలు కలబొల్లికబుర్లు చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయమంటే కేసులు కొట్టి అధికారులను పంపించి బెదిరింపులకు దిగటం అత్యంత దుర్మార్గమని పామర్రునియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వర్ల కుమార్ రాజా తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చినహామీలు అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అంగన్వాడి కార్యకర్తలు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నిరసన ధర్నాకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను కలిసి హక్కులు కాపాడుకునేందుకు మీరు చేస్తున్న పోరాటంలో తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వర రావు, కార్యదర్శి వీరంకి తులసీదాసు, నాయకులు

తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మండవ పిచ్చేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సిపిఎం తరపున యద్దనపూడి మధు, శీలం నారాయణ రావు తదితరులు హాజరవుగా మండలంలోని కాంగ్రెస్ నాయకులు సైతం తమ సంఘీభావం తెలియపరిచారు.

## ఘనంగా పొట్టి శ్రీరాముల వర్ధంతి

విశాలాంధ్ర అవనిగడ్డ : అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతిని దివిసీమలో పెద్ద ఎత్తున నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 71 వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వైయస్ఆర్ పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. ఆంధ్రరాష్ట్రం కోసం పోరాడిన వారిలో శ్రీరాములు అగ్రగణ్యులని గాంధీజీ న్యాయకత్వంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మద్రాస్‌లోని బులుసు సాంబమూర్తి నివాసంలో 1952 అక్టోబర్ 19 న ఆమరణ నిరాహార దీక్ష ఆరంభించి 58 రోజుల పాటు దీక్షను కొనసాగించారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సాధనలో 1952 డిసెంబర్ 15 రాత్రి ఆశయం నెరవేరకుండానే ప్రాణ త్యాగం చేసి పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారని, త్యాగబుద్ధి అలవరుచుకోవడం కోసం నేటి యువత ముందుకు వచ్చి నివాళ్ళు అర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, ఎం.పి.పి

తుంగల సుమతీ, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య నేతల ఆధ్వర్యంలో** : పోలీస్ స్టేషన్ సమీపంలోని పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి 200 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించి మాట్లాడారు. ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ మండల అధ్యక్షులు కొల్లిపార రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు,ఆర్యవైశ్య మహా సభ జిల్లా అధ్యక్షులు యక్కలి మణిదీప్, సి.ఐ లు గాంధీజీ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

**కొనకళ్ళ నారాయణరావు**

విశాలాంధ్ర అవనిగడ్డ : అంగన్‌వాడీ ఉద్యోగులు తమ న్యాయమైన కోరికలు పరిష్కరించాలని మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గత 4 రోజులుగా తమ న్యాయమైన కోర్కెల పరిష్కారానికి నిరసన దీక్షలు చేస్తుంటే రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులతో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులకొట్టించి రాష్ట్ర ప్రభుత్వం తమ ఆత్మగౌరవాన్ని తగలబెట్టిందని కృష్ణాజిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నిర్మలా జ్యోతి అన్నారు. ప్రభుతవం ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం వెనుక ఎటువంటి అర్ధం ఉందో ప్రజలు తెలుసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందితో పని లేకుండా సచివాలయ సిబ్బందితో విధులు ఎలా నిర్వర్తిస్తారని ఆమె ప్రశ్నించారు. నాలుగు రోజులుగా అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షా శిబిరానికి తెలుగుదేశం, జనసేన నేతలు వెళ్ళి సంఘీభావం తెలిపారు. కొనకళ్ళ నారాయణ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు అన్యాయం చేస్తూ, వారికి సక్రమంగా కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా తుంగలో త్రొక్కి అన్యాయం చేస్తున్నారన్నారు. సమాజంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమపథకాలను అమలు చేస్తున్నందుకు జీతాలు పెంచమని అంగన్‌వాడీ ఉద్యోగులు కోరడం

జగన్‌మోహన్‌రెడ్డికి తప్పుగా కనిపించిందా అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది లేకుండా తాళాలు పగులకొట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోవలసినదిగా తహశీల్దార్ ఎల్ శివరామకృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుశీల, నాగమణి, పాములమ్మ, టిడిపి, జనసేన నేతలు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు.

## విద్యతోపాటు క్రీడలు అంతర్భాగం కావాలి

విశాలాంధ్ర, మచిలీపట్నం : విద్యలో క్రీడలు అంతర్భాగం కావాలని అప్పుడే విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి జరుగుతుందని బెల్ కంపెనీ ఏజీఎం డి సహదేవుడు పేర్కొన్నారు. స్థానిక మచిలీపట్నంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ లో వార్షిక క్రీడా దినోత్సవం, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 60వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి విద్యాలయాల్లో ఎక్కడ క్రీడలకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల అనేక రకాల శారీరక రుగ్మతల బారిన పడుతున్నారన్నారు. అందువల్ల ప్రతి విద్యా సంస్థ లో కేంద్రీయ విద్యాలయ మాదిరిగా ప్రతిరోజు విద్యార్థులకు క్రీడ సమయాన్ని కేటాయించాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు ఫణి కుమార్, యూబీఐ ఫౌండర్ బ్రాంచ్ మేనేజర్ ఉమాదేవి, విశ్రాంత బెల్ సివిల్ ఇంజనీర్ ఏ.ఆర్.కే. ప్రసాద్, ఏ.పి.ఎస్.ఆర్.టీ.సీ. డిపో మేనేజర్ టీ. పెద్దిరాజు, సైకియాట్రిస్ట్ ప్రభు రామ్ లు విశిష్ట అతిధులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ గ్లోరీ స్వరూప రాణి పిజిటీలు, టీ.జి.టీలు, పిఆర్‌టీ లు పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేత లకు బహుమతి లు అందించారు.

## పంటను పరిశీలించిన కేంద్ర అధికారులు

విశాలాంధ్ర, కూచిపూడి : ఈనెల మొదటి వారంలో సంభవించిన రైతులను నట్టేట ముంచిన మిచౌంగ్ తుఫాను కారణంగా కురిసిన అకాల వర్షాలతో ముంపు పాలైన వరి పైరుకు సంబంధించిన ధాన్యాన్ని శుక్రవారం ఉయ్యూరు ఆర్డిఓ దాసిరాజు పర్యవేక్షణలో కేంద్ర బృందం పరిశీలించింది. ఆవర్షంతోతడిసి రంగు మారిన ధాన్యాన్ని పరిశీలించి నివేదికల రూపంగా నమోదు చేసుకున్నారు. కూచిపూడి, మొవ్వ గ్రామాలలో ధాన్యాన్ని మాత్రమే పరిశీలించారు. పంట పరిశీలనకు వచ్చిన కేంద్రఅధికారులబృందం సమాచారం ముందస్తుగా ఎవరికి తెలియకపోవడంతో కేవలం ఇది అధికారులకు మాత్రమే పరిమితమైంది. దీనితో వివిధ పార్టీల రైతు సంఘం నేతలు గాని, రైతుల పక్షాన పోరాడే వామపక్షాలు ప్రతిపక్ష పార్టీలనేతలుకాని హాజరు కాలేకపోయారు. మొవ్వలో కౌలు రైతు శీలం రాంబాబుకి చెందిన 12 ఎకరాలలో సాగు చేసి నూర్చిన ధాన్యం రోడ్డు పక్కన ఆరబెట్టుకున్నాడు. ఈ పరిస్థితుల్లో అధికారులు ఆ ధాన్యాన్ని పరిశీలించారు. ఆ సమయంలో కౌలు రైతు రాంబాబు తన ధాన్యం పరిస్థితిపై అధికారుల వద్ద తన బాధను విన్నవించుకున్నాడు. ఇదే పరిస్థితి ఆ గ్రామ రైతు ఎన్. వసంత కుమార్ 10 ఎకరాల పొలంలోసాగయిన వరి పంట పరిస్థితిపై అధికారులకు

విన్నవించుకున్నాడు. రైతుల వద్ద సేకరించిన వివరాల నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో సివిల్ సప్లైస్ డిఎం గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నఉయ్యూరు ఆర్డిఓ దాసిరాజు, మినిస్ట్రీస్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ కన్స్యూమర్ ఎఫైర్స్ ప్రతినిధి వీనస్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ జి రాంప్రసాద్, సివిల్ సప్లైస్ టెక్నికల్ అసిస్టెంట్ కోటిరెడ్డి, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్, రైతులుపాల్గొన్నారు.

## అభ్యర్థుల వయోపరిమితి పెంచాలి

విశాలాంధ్ర, మచిలీపట్నం : వైకాపా ప్రభుత్వ నోటిఫికేషన్ల జాప్యం వల్ల అభ్యర్థుల వయోపరిమితి 42 నుండి 44 కు పెంచాలి... ఆడుదాం ఆంధ్ర పేరుతో యువత జీవితాలతో మరోసారి ఆటలాడేందుకే వైకాపా కొత్త నాటకం అని కృష్ణా జిల్లా తెలుగుయువత అధ్యక్షులు దండమూడి చౌదరి ఆగ్రహం వ్యక్తం చేసారు. గడచిన నాలుగున్నరేళ్లుగా ఆంధ్రప్రదేశ్లో యువత, నిరుద్యోగులకు వైకాపా ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తూ ముఖ్యమంత్రి కపటపూరిత వైఖరిని ఎండగడుతూ కృష్ణా జిల్లా తెలుగుయువత అధ్యక్షులు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో మచిలీపట్టణం పార్లమెంట్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నేర గణాంకాల సంస్థ తాజా నివేదిక ప్రకారం నాలుగేళ్ళలో దాదాపు 1345 మంది మృతి చెందారని, 2022లో 8,908 మంది బలవన్మరణాలకు పాల్పడితే, అందులో 364 మంది నిరుద్యోగులేనని, వీరిలో పురుషులు 326 మంది, మహిళల 38 మంది మృతి చెందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మోర్ల శివ, జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కట్ట దుర్గారావు, పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, మచిలీపట్టణం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు సలీం, టౌన్ అధ్యక్షులు అయ్యప్ప, పామర్రు నియోజకవర్గ అధ్యక్షులు కేదారసి పల్లి శ్రీను, బీమవరపు పరమేశ్వర రావు, మణి కుమార్, అనిల్ బాషా, కిషోర్, చిన్న బాబు తదితర తెలుగు యువత నాయకులంతా పాల్గొన్నారు .

## తెరచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

విశాలాంధ్ర - చల్లపల్లి : అంగన్వాడీ కార్యకర్తల సమ్మెతో మూతబడిన కేంద్రాలు ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం తెరచుకున్నాయి. ప్రభుత్వ అధికారులు దగ్గరుండి అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలకొటి ంచి తలుపులు తీయించారు. వాలంటీర్లను ఇంటింటికీ పంపి పిల్లలను పంపాల్సిందిగా సూచించటంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలను పంపారు. మరికొందరు వారే స్వయంగా తీసుకువచ్చి కొద్దిసేపు ఉంచి తీసుకువెళ్లారు. చల్లపల్లి తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. చల్లపల్లిలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సిహెచ్. ఆదిలక్ష్మి, కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, వీఆర్వోలు కేంద్రాలను తెరిపించారు. సచివాలయ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రేడ్ -5 కార్యదర్శులు విధులు నిర్వహించారు.

## అంగన్వాడీ వర్కర్లు సమ్మెలో ఉంటే మిడ్ డే మీల్ వర్కర్లను ఇబ్బంది పెట్టొద్దు

(విశాలాంధ్ర) పెడన: గత నాలుగు రోజులుగా అంగన్వాడి వర్కర్లు సమ్మెలో ఉంటే పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ఇబ్బందులు పెట్టడం చాలా దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కట్టా. హేమ సుందరావు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ సమ్మె బాట పడితే అంగన్వాడి కేంద్రాలను మాత్రం సచివాలయ అధికారులు తాళాలను పగలగొట్టి ప్రవేశించటం బాధాకరమని ఏఐటీయూసీ, సిఐటియు, నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రాన్ని ఇచ్చారు. సిపిఎం పార్టీ పెడన మండల కార్యదర్శి పంచల నరసింహారావు మాట్లాడారు. ఈ కార్య క్రమంలో సిపిఐ పార్టీ పెడన పట్టణ కార్యదర్శి తుమ్మా.కొండయ్య, కుర్మా. విజ్ఞేశ్వరరావు ఉన్నారు.

## ఉదయం, సాయంత్ర విద్యుత్ కోత

విశాలాంధ్ర - చల్లపల్లి : అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో శనివారం ఉదయం, సాయంత్రం ఒక్కో గంట విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ చల్లపల్లి డీఈఈ పులి శివనాగేశ్వరరావు తెలిపారు. అవనిగడ్డలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషనులో నూతన 7.2 ఎంవీఏఆర్ కెపాసిటర్ బ్యాంక్ ఐసోలేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో మంగళాపురం విద్యార్థినికి కాంస్య పతకం

విశాలాంధ్ర - చల్లపల్లి : రాష్ట్ర స్థాయి పోటీల్లో చల్లపల్లి మండలం మంగళాపురం విద్యార్థిని కాంస్య పతకం సాధించింది. ఈనెల 12వతేదీ నుంచీ 14వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 17 అథ్లెటిక్స్ విభాగంలో హేమర్ త్రోలో కోమటి శ్రావ్య కాంస్య పతకం సాధించి సత్తాచాటింది. కాంస్య పతకం సాధించిన శ్రావ్యను పాఠశాల హెచ్ఎం వివి.రమణ, పీఈటీ సిహెచ్.రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎంలపై అవగాహన

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వమండలంలోని 7గ్రామాలలో గల 30 పోలింగ్ కేంద్రాలలో పలువురు ఓటర్లకు శుక్రవారం మొవ్వ మండల తాసిల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తాసిల్దార్.సిహెచ్ గోపాల్ రావు, జూనియర్ అసిస్టెంట్ జి. శామ్యూల్ ఈవీఎం మిషన్ల ద్వారా ఓటు వేసే విధానాన్ని చూపించిఅవగాహన కల్పించి చైతన్య పరిచారు. పెదపూడి, మొవ్వ, పెదముత్తేవి, కోసూరు ,వేములమడ, కాజ, పద్దారాయుడు తోట గ్రామలలో గల 30 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కల్పించిన అవగాహనకుసంబంధిత వి.ఆర్.ఓలు, విఆర్ఏలు సహకరించారు. కాగా పోలింగు కేంద్రాల వద్ద అవగాహన కలిగించే సమయంలో ఏ విధమైన సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందిని కూడా కేటాయించటం గమనార్హం..

## చల్లపల్లి పోలీస్ స్టేషన్లో డీఎస్పీ వార్షిక తనిఖీ

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లి పోలీసే స్టేషన్ వార్షిక తనిఖీలో అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం చల్లపల్లి స్టేషన్కు ఆయన తనిఖీ నిమిత్తం వచ్చి రికార్డులు పరిశీలించారు. తొలుత డీఎస్పీకు చల్లపల్లి సీఐ సిహెచ్. నాగప్రసాద్, ఎస్ఐ సిహెచ్. చిన్నబాబులు స్వాగతం పలికారు. సిబ్బందితో కలిసి గౌరవ వందనం సమర్పించారు. స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వార్షిక తనిఖీలో భాగంగా ఏడాది కాలంలో కేసుల వివరాలు వాటి పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

విశాలాంధ్ర, మచిలీపట్నం : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం వీసీ హాలులో అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయం, అందరికి ఆదర్శం అన్నారు. ఈ కార్య క్రమంలో డిఆర్వో పెద్ది రోజా, కలెక్టరేట్ పరిపాలనాధి, కారి

రాధిక, ఉప విద్యాశాఖ అధికారి యు వి సుబ్బారావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న పరిపాలనలో గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - కృత్తివెన్ను : ముఖ్యమంత్రిగా జగనన్న పరిపాలనలో గ్రామాలలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని మండల వైసీపీ కన్వీనర్ వెంకటరాజు అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో వైనీడ్ జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామాలలో జగన్ మోహన్ రెడ్డి క కోట్ల రూపాయలు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. లక్ష్మీపురం గ్రామంలో దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు అలాగే అమ్మ ఒడి, జగనన్న అసరా తదితర కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటికి నగదు బదిలీ చేస్తున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో కూడా జగన్మోహన్

రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. స్థానిక సర్పంచ్ పులగం సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొక్కిలిగడ్డ బాపూజీ, వైసిపి జిల్లా కార్యదర్శి పులగం నాయుడు, పెడన యూత్ కన్వీనర్ ఆకన సాయి, రాము, ఇఒపిఆర్డిఒ, సచివాలయం సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్ట్, క్రాఫ్ట్, క్రియేటివ్ రైటింగ్ పోటీలు

విశాలాంధ్ర - చల్లపల్లి : యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో చల్లపల్లి మండలం రామానగరంలోని శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు ఆర్ట్, క్రాఫ్ట్. క్రియేటివ్ రైటింగులలో శుక్రవారం పోటీలు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ రామకుమార్, మార్కెటింగ్ మేనేజర్ ఉదయ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులుఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డి.సురేష్, ఉపాధ్యాయ బృందం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## మొబైల్ ఈవీఎంతో ఓటు హక్కు వినియోగం అవగాహన

విశాలాంధ్ర - పెనమలూరు :

మొబైల్ ఈవిఎంతో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహనా కార్యక్రమంను శుక్రవారం చేపట్టడం జరిగిందని మండల తహశీల్దార్ వెంకటశివయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎంఆర్వో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరికి ఎంతో విలువైనదిగా తెలిపారు. ప్రజలు తమకు ఉన్న భయాలను పోగొట్టుకుని ఈవిఎంల పై అవగాహన పొందడం ద్వారా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ భవాణి, స్థానిక రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

**CHANGE OF THE NAME**
I, SETIPALLI PUSHPA LATHA (Old Name) W/o. GANESH CHANDRA, Resident of # 5 99/1/, Venkat Rama Gardens, Jabilli Hospital Road, Poranki, Penamaluru (M), Krishna, AP-521137. I have changed my name as SETTIPALLI PUSHPA LATHA (New Name) W/o. GANESH CHANDRA. Hereafter my name is known as SETTIPALLI PUSHPA LATHA (New Name), W/o. GANESH CHANDRA

**CHANGE OF NAME**
I Abdul Rashid (Old Name), S/o. Abdul Farood Saheb, R/o D.No:2-38, Kothapeta, 1st Ward, Kowtharam, Krishna District., A.P India. I Changed My Name Abdul Rasheed (New Name) Hence forth I will be known as ABDUL RASHEED

**CHANGE OF NAME**
I Abdul Ravuf (Old Name), S/o. Abdul Rasheed, R/o D.No:2-38, Kothapeta, 1st Ward, Kowtharam, Krishna District., A.P India. I Changed My Name Abdul Rouf (New Name) Hence forth I will be known as ABDUL ROUF

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

# వీధి విక్రయదారుల చట్టం సక్రమంగా ఉపయోగించుకోవాలి

## జి.ఓబులేసు

**విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) :** స్వయం ఉపాధి చేసుకుంటున్న వీధి విక్రయదారుల చాలామందికి వారికి ఉన్న చట్టంపై అవగాహన లేకోవటం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని,చట్టంలో ఉన్న సౌకర్యాలు హక్కులు తెలుసుకుని ముందుకుసాగాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు సూచించారు. ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయధారుల కార్మిక ఫెడరేషన్ ( ఏఐటీయూసీ అనుబంధం) అధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని హను మంతరాయ గ్రంథాలయంలో వీధి విక్రయదారుల చట్టం 39వ సెక్షన్‌లలో 18 సౌకర్యాలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ అధ్యక్షులు కొట్టు రమణరావు అధ్యక్షత వహించారు. ప్రధాన వ్యక్తగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ స్వయం పోషక వృత్తిలో ఉన్నవారు ప్రభుత్వం నుండి ఎటువంటి చట్టబద్ధ సహాయం లేకుండా ఫుట్‌పాత్‌లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారు రాష్ట్రంలోని ప్రతి పట్టణం ఉన్నారన్నారు. గతంలో పెద్దపెద్ద పట్టణాల్లోనే ఉండే ఈ వృత్తి నేడు సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరించి ఉంది ఒక మేజర్ పంచాయతీ ఉన్న రోడ్డు సైడ్ వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నారు చిన్న చిన్న వ్యాపారస్తులకు ఒక ఆదాయం వనరుగా ఉంటూ కుటుంబ పోషణకు ఓ మార్గంగా వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారన్నారు.అయితే వీరందరూ సంఘటితమై ఒక సంఘముగా ఏర్పాటు చేసుకుని ఓ భద్రత చట్టాన్ని తీసుకొచ్చుకున్న వారికి ఆసరాగా నిలబడడానికి కాపాడాలని నియమము చట్టంలో ఉంది అయితే దానిని అమలు చేయడంలో వ్యత్యాసాలు వైరుధ్యాలు కనబడుతున్నాయి అన్నారు. వైరుధ్యాలు వలన వాటిన అమలు చేయవలసిన అధికారా యంత్రాంగం వైఫల్యం కనబడుతున్నాయి అన్నారు.జనాలు తిరిగే చోట వ్యాపారాలు చేసుకుంటేనే వారి ప్రయోజనం అలా కాకుండా జనాలు తిరగనచోట వ్యాపారాలు చేసుకొవాలని అంటే వారి కుటుంబ పోషణ జరగదన్నారు.ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరే చోట తరలించాలంటే సంబంధిత విభాగాలతో పాటు యూనియన్ నాయకులతోటి చర్చించుకుని మంచి నిర్ణయం తీసుకోవాలి చిన్న వృత్తుల వారిపై పోలీసుల జులుం చూపుతా ఉంటారు అటువంటి జరగకుండా ఐక్యమత్యంలో ఉండాలన్నారు.ఈ చట్టంలో ఉన్న వాటిన అమలు చేసే సమయంలో అధికారులు,చిరువ్యాపారులు కలిసి పరిష్కారం చేసుకుంటే ఉపయోగకారంగా ఉంటుంది అలా కాకుండా అధికారులు చట్టం తామే అమలు చేయాలి తమ చెప్పినప్పుడు దాన్ని దండన కింద భావించవలసి ఉంటుందన్నారు. అందుకని ఒక విధానం అమలులో ఒకరు ఒకరు పరస్పరం గౌరవించుకుని చట్టాన్ని నిబంధనలు అమలు చేయడానికి ప్రయత్నిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.నేడు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి దాంతో చిరువ్యాపారులు తగిన పెట్టుబడి ఉండటంలేదు దాంతో వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దాంతో వారి కష్టం వారు దోచు కుంటున్నారన్నారు. ఈ కార్యక్రమానికి విఎంసి ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిణి,కార్యదర్శి శేఖర్,ట్రాఫిక్ ఏ.డి.సి.పి డి.ప్రసాద్,అడిషనల్ డిసిపి టాస్క ఫోర్స్ జివి.రమణమూర్తి,ఏఐటీయూసీ నగర ధ్రాన కార్యదర్శి మూలి సాంబశివరావు కార్యదర్శి కెఆర్.ఆంజనేయులు,వియ్యపు నాగేశ్వరరావు,నీలం నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

# పేదల ముంగిట్లోకే కార్పొరేట్ వైద్యం

## రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత

**విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) :** వైఎస్ఆర్ గ్రామీణ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అత్యాధునిక మౌలిక వసతులను కల్పించి ఆధునిక వైద్యాన్ని అందిస్తున్నామని రాష్ట్ర హోంశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత అన్నారు. డా.వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సహాయాన్ని రూ.25లక్షలకు పెంచి దివంగత నేత వైఎస్ఆర్ ఆశయాలను మరింతగా ఆమలు చేసి పేదలతకు మెరుగైన శస్త్ర చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామని, ఫ్యామిలీ డాక్టర్ విదానం ద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. విజయవాడలోని 60వ డివిజన్ వాంబే కాలనీలో రూ.1.07కోట్లుతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టి రూ.వేల కోట్లు మంజూరు చేసి ప్రభుత్వ అసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.విష్ణువర్ధన్, నగర మేయర్ భాగ్యలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, డీఎం అండ్ హెచ్‌వో డా.సుహాసిని, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పేదలకు చీరలు పంపిణీ చేసిన గన్నే ప్రసాద్

**విశాలాంధ్ర - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల కేంద్రంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీస్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్(అన్న) పేదలైన 100 మందికి చీరలు శుక్రవారం పంపిణీ చేశారు. తురకా అంకమ్మకు రూ. 20వేలు అర్థిక సహాయం అందజేశారు. క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి పర్వదినాలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ఉయ్యూరు వెంకటేశ్వరరరెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు పాలంకి సురేష్‌రెడ్డి, బండారు కొండారు. కందుకూరు నాగేశ్వ రరావు, పూల వెంకటేశ్వరరావు, ఫ్రెండ్స్ సర్వీసు సొసైటి అధ్యక్షులు చాట్ల విజయ్‌కుమార్, హాన్న పాల్గొన్నారు.

# షేక్ సాల్జీ మృతి బాధాకరం

**విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) :** మాజీ యు.టి.ఎఫ్. అధ్యక్షులు, ప్రస్తుత పి.డి.ఎఫ్. ఎమ్.ఎల్.సి. షేక్ సాల్జీ ఆకస్మిక మృతిపట్ల ఏ.పి.ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బండి శ్రీని వాసరావు, కె.వి.శివారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. షేక్ సాలీ సౌమ్యశీలి, మృదుస్వభావి, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యలపై అలుపెరగని పోరాటశీలి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల వారు ఆవేదన వెలిబుచ్చారు. ఏ.పి. ఎన్జీవో సంఘ రాష్ట్ర కార్య నిర్వాహక వర్గం ఆయా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు వారి కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర మహిళా విభాగం ఛైర్‌ఫర్సన్, కన్వీనర్, కార్యవర్గ సభ్యులు, తమ సంతాపాన్ని, ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

# పొట్టి శ్రీరాములుకి నివాళులర్పించిన మేయర్

**విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ :** నగర పాలక సంస్థ ప్రధమ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మేయర్ శ్రీమతి రాయన భాగ్యలక్ష్మి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.మాధురి, అదనపు కమిషనర్ కే.శకుంతల, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పీ.రత్నావళి, అకౌంట్స్ ఎగ్జమినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంతలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ ఇక్బాల్ హుస్సేన్, మేనేజర్ శ్రీనివాస్‌రావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు సీపీఐ, ఏఐటీయూసీ మద్దతు

**విశాలాంధ్ర-విజయవాడ(తిరువూరు) :** గత మూడు రోజులు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యమానికి సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు ప్రకటించారు. శుక్రవారం అంగన్‌వాడీలు తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న సీపీఐ తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్‌కి కనీస వేతనం 26 వేల రూపాయల ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, సంపూర్ణ పోషణ మెనూ రేట్లు పెంచాలని, ప్రమోషన్ల విషయంలో ఏ రాజకీయ పార్టీ కూడా జోక్యం చేసుకోకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు ఎస్.కె మీరా (కార్పెంటర్) ఏఐవైఎఫ్ తిరువూరు నియోజకవర్గ నాయకులు ఎస్కే సుభాని, సీపీఐ నాయకులు అయినాల ముత్తయ్య అశోక్ నరసింహ పాల్గొన్నారు.

# ఎస్‌బీ ఏసీపీగా పార్థసారధి

## ఏ.ఆర్ ఏసీపీగా ప్రసాదరావు బాధ్యతలు

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా పార్థసారధిగా, ఏ,ఆర్ ఏసీపీగా ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. పార్థసారధి సీఐడీలో ఆర్‌వో తిరుపతిలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొంది జిల్లాకు బదిలీయ్యారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ఎస్‌బీ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ప్రసాదరావు శ్రీకాకుళంలో ఏఆర్.డీఎస్పీగా పనిచేస్తూ ఎన్టీఆర్ జిల్లాలో ఏఆర్. ఏసీపీగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు ఏసీపీలు శుక్రవారం పోలీస్ కమిషనర్ కాంతి రాణాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

# సోమేపల్లి మరణం బాధాకరం

## -కృష్ణాజిల్లా రచయితల సంఘం

**విశాలాంధ్ర-విజయవాడ :** కృష్ణాజిల్లా రచయితల సంఘానికి ఆప్తుడైన కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య కీర్తిశేషుడయ్యారన్న వార్త తెలుగు సాహితీ ప్రపంచాన్ని కలచి వేసిందని సంఘం గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వయసులో తమ కన్నా చిన్నవైన ఇంత తొందరపడి వెళ్ళిపోవటం బాధాకరం ఉందన్నారు. ఆయన గుడివాడలో రెవెన్యూ అధికారిగా ఉన్నప్పుడు తమకు బాగా సన్నిహితులయ్యారని తెలిపారు. మచిలీపట్నం నుండి నెల్లూరు వరకూ రచయితల పాదయాత్ర నిర్వహించినప్పుడు గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా సోమేపల్లి వారు తమకెంతో సహకరించారని గుర్తు చేసుకున్నారు. గతవారం ఆయన అస్వస్థులుగా ఉన్నారని తెలిసి వారింటికి వెళ్ళి కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన పరామర్శించటం జరిగిం దన్నారు. నిజానికి ఆ రోజున ఆయన సుఖంగా లేకపోయినప్పటికీ ఉల్లాసంగానే ఉన్నారని సంతోషంగా గడిపారని పేర్కొన్నారు. ఇంత త్వరగా మృత్యువు ముంచుకొస్తుందని అనిపించలేదని ఆవేదన చెందారు. కవిత్వమన్నా, కథలన్నా ఆయనకు పరమ ప్రీతి అని, నానీల ప్రక్రియని బాగా ప్రోత్సహించారని చెప్పారు. కథల పోటీలు పెట్టి కథకులకు బహుమానాలు పురస్కారాలిచ్చి గౌరవించారని తెలిపారు. ఎందరో కవులకు గ్రంథప్రచురణకు ఆర్థికంగా తోడ్ప డ్డారని, గుంటూరు జిల్లా రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ రచ యితల సంఘం కోసం ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన లేని లోటు సాహితీ ప్రపంచానికి ముఖ్యంగా యువ రచయితలకు తీరనిలోటే! ఆయన కుటుంబానికి కృష్ణాజిల్లా రచయితల సంఘం తరుపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# నగరంలో హీరోయిన్ కృతిశెట్టి సందడి

**విశాలాంధ్ర-విజయవాడ :** నగరంలో హీరోయిన్ కృతిశెట్టి సందడి చేసింది. విజయవాడ బందర్‌రోడ్డులోని స్వాతి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా విచ్చేసి అందర్నీ ఆకట్టుకుంది. తనకు విజయవాడ రావడం చాలా ఆనందంగా ఉందని, మహిళల కోసం అన్ని రకాల ఆధునిక డిజైనర్ల తో కూడిన శారీస్ ఈ షో రూమ్ లో ఉండటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాల్‌లోని వివిధ రకాల డిజైనర్ సారీస్ ను తిలకించారు.ఈ సందర్భంగా చేనేత కార్మికులు తయారుచేసిన 4లక్షల సారీని ఆమె ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను విజయవాడకు రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.ఈ షోరూమ్ లో మగువలు మెచ్చే వివిధ రకాల డిజైన్లు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. కేవలం మహిళల కోసమే ఇన్ని రకాల డిజైన్లు పొందపరచడం అభినందియమని ఆమె కొనియాడారు ఈ ప్రారంభంలో నగరమేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైసిపి తూర్పు ఇంచార్జ్ దేవినేని అవినాష్, కార్పొరేటర్ రహానే లు పాల్గొని తమ అభిప్రాయాలను వారు వెల్లడించారు.అనంతరం స్వాతి షోరూమ్ నిర్వాహకులు ఊర వెంకట రమణ మాట్లాడుతూ 63సంవత్సరాల క్రితం ప్రారంభమైన తమ సంస్థ అంచలంచలుగా ఎదిగి ఉన్నత స్థానంలో ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోనే వస్త్ర వ్యాపారంలో చీరాలది ప్రముఖ స్థానం అని, ఆ చీరాలలోనే నెంబర్ వన్ గా తమ సంస్థ నిలిచిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా చీరాలకి తమ సంస్థకు వస్తారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆరు బ్రాంచ్లో తమ సంస్థ ఉందని తెలియజేశారు. తమ సంస్థలో 200 రూపాయల శారీల నుంచి ఐదు లక్షల శారీల వరకు ఉందని తెలిపారు. భారతదేశంలోనే ఎన్నడూ లేని విధంగా తమ సంస్థలోనే మహిళల కోసమే ఈ షాపింగ్ మాల్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# పడమటలో పట్టగలు ఘోరం

- వృద్ధుడి నుంచి 258 గ్రాముల బంగారం లాక్కువెళ్లిన దుండగులు
- అంతరాష్ట్ర ముఠా పనేనా !

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** పటమటలో పట్టపగలు ఘోరం జరిగింది. వృద్ధుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 258 గ్రాముల బంగారం అభరణాల బ్యాగ్‌ను గుర్తుతెలియని దుండగులు లాక్కుని వెళ్లారు. ఈ ఘటన శుక్రవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ న్యూ పోస్టల్ కాలనీకి చెందిన వల్లభనేని శేషగిరిరావు(74) తాకట్టులో ఉన్న తన బంగారం అభరణాలను విడిపించుకునేందుకు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఓ బ్యాంక్‌కు వెళ్లారు. బ్యాంక్‌లో బంగారం అభరణాలు విడిపించుకుని బయటకు వచ్చారు. అక్కడ కాపు కాచిన దుండగులు రోడ్డుపై డబ్బులు పడేసి వృద్ధుడి దృష్టి మళ్లించి బంగారం అభరణాల బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. కంగుతిన్న వృద్ధుడు పోలీసులను ఆశ్రయించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రంగంలోకి దిగ్గారు. దర్యాప్తు చేపట్టారు. దోపిడీ దొంగలు ఎంత మంది అనే వివరాలు ఆరా తీశారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దొంగలు పథకం ప్రకారం రెక్కీ చేశాకే దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ప్రత్యేక పోలీసు బృందాలు దుండ గులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దృష్టి మళ్లించి దోపిడీకి పాల్పడే అంతరాష్ట్ర ముఠా ఈ దోడీపీకి పాల్పడిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# లంక భూముల్లో అరటి తోటలు సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాలి

**విశాలాంధ్ర- కంచికచర్ల:** కంచికచర్ల మండల పరిధిలోని ఆత్కూరు లంక గ్రామాల్లో అరటి తోటలను శుక్రవారం జనసేన పార్టీ ఇంచార్జ్ తంబళ్లపల్లి రమాదేవి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా అరటి తోటలు విరిగిపడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి ప్రభుత్వం అందించే సాయం కోసం రైతుల ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు.తుఫాను వచ్చి పది రోజులు గడుస్తున్న నేటికి ప్రభుత్వం నుంచి సహాయం అందకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# రైల్వే పెన్షనర్స్ మా కుటుంబ సభ్యులే

**విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) :** పదవీ విరమణ చేసిన రైల్వే ఉద్యోగులు కూడా తమ కుటుంబ సభ్యులుగానే పరిగణిస్తామని వారికి రావలసిన అన్ని సదుపాయాలను అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తారని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ ఆడిటోరియంలో శు క్రవారం పింఛను అదాలత్ - 2023 నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఆర్ఎం మాట్లాడుతూ పెన్షన్ అదాలత్ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రధానంగా పింఛన్, కుటుంబ పింఛన్, గ్రాట్యుటీ, సెటిల్‌మెంట్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారమని, పింఛనుదారులు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తమను సంప్రదించవచ్చని సూచించారు. ఎమ్.శ్రీకాంత్(ఆపరేషన్స్),స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రలైజ్డ్ పెన్షన్ ప్రాసెసింగ్ సెంటర్ (సిపిసిసి) జనరల్ మేనేజర్ జిఎస్ఆర్ మోహన్ రావు,సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ ఇవి శివరామకృష్ణ, డిపిఓ కట్టా ఆనంద్,ఇతర అధికారులు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, పాల్గొన్నారు.

# రాష్ట్ర హక్కులు- అభివృద్ధిని సాధించే పార్టీలకే అధికారం ఇవ్వాలి

**విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) :** ఉచిత పథకాల ముసుగులో ప్రజల శ్రమలు దోచుకుంటున్నారని కనీస వసతులకు మౌలిక సదుపాయాలకు ప్రజలు నోచుకోలేకపోతున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మేనిఫెస్టో ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య వైద్యం ఖరీదైన వ్యాపారంగా పాలకులు మార్చేశారన్నారు. ఈ సమావేశంలో ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు బేతురామ్మోణరావు, ఆర్.పి.సి. సెక్యులర్స్ పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు, ఎం.డి. హుస్సెన్, దుడ్డే త్రినాథ్, బర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ముందుండాలి

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** సామాజిక సేవలో ముందుండాలని గెల్పింగ్ టు గెదర్ సంస్థ కన్వీనర్ నాగమల్లిక అన్నారు. చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో రక్షణ కల్పించే స్వెటర్లు పంపిణీ చేశారు. శుక్రవారం ముత్యాలంపాడులో గెల్పింగ్ టు గెదర్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో పేద పిల్లలకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతను అందించడం అభినందనీయమని దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, బ్రహ్మదేశం రమాదేవి, కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, హేమంతరావు, షఫీ, పోతుల విల్సన్ రాజు పాల్గొన్నారు.

# రోడ్లు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** రోడ్లు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం విజయవాడ విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ అక్బర్ బాషా, (ఎన్‌జీవోయూహెచ్ఆర్‌పీసీ) హజరైయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సెక్రటరీ శ్యామ్ ప్రసాద్, ప్రిన్సిపాల్ కేఎల్.ప్రసన్న, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

## వర్ల కుమార రాజా

**విశాలాంధ్ర -పమిడిముక్కల:** రాష్ట్రంలో రానున్న ఎన్నికలు ప్రతిష్ఠాత్మ కంగా తీసుకోవాలని నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు వైసిపి ప్రభుత్వం చేసే అరాచకాలను ఎండ గట్టి తెలుగుదేశం గెలుపునకు సైనికుల్లా కృషి చెయ్యాలని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా పిలుపు ఇచ్చారు. శుక్రవారం వీరంకిలాకులో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను అవస్థపాలు చేసిన జగన్ రెడ్డి అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు కోట వీరబాబు మాట్లాడుతూ ఈ మోసకారి ప్రభుత్వాన్ని ఎప్పుడు సాగనంపాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని ఒక ప్రక్క సమ్మెలు దాడులు హత్యలు అరాచకాలు మరోక పక్క రైతులు ఆందోళనలతో వైసీపీ ప్రభుత్వం పరాకాష్టకు చేరుకుందని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు యం.వి.సుబ్బయ్య జక్కా శ్రీనివాస రావు ఎల్.బాబు రావు మొవ్వ మండలం పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వర రావు పామర్రు మండలం పార్టీ అధ్యక్షుడు కె.ప్రవీణ్ చంద్ తమ్మారెడ్డి జనసేన నాయకులు తాడిశెట్టి నరేష్ సనకా కిరణ్ కార్యకర్తలు అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

## కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) :** ప్రశాంత ఎన్నిలక నిర్వాహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శు క్రవరం నిర్వహించిన సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు, ఏఇఆర్‌వోలకు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం సెక్టార్ అధికారులకు శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఎన్నికలను కొత్తగానే చూడటంతో పాటు ఏ స్థాయిలోనూ పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక్కొక్క సెక్టార్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లు పరిది ఉంటుందని, సెక్టార్ అధికారులుగా నియమించిన వారికి వారం రోజులు ముందుగా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.పీ. సంపత్‌కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌వో నాగేశ్వరరావు, ఆర్డీవోలు మాధవి, సాయిబాబా, పోలీసు అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

# ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీ.ఎడ్.బిఎస్సీ నర్సింగ్, పిహెచ్‌డీ కోర్సులకు 2024 సంవత్సరానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ కే.సుమలత శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షను దేశవ్యాప్తంగా జనవరి 7వతేదీన నిర్వహించనున్నట్లు తెలియజేశారు. దరఖాస్తు చేసుకోవడానికి 31 డిసెంబర్ 2023 ఆఖరు తేదీగా యూనివర్శిటీ నిర్ణయించిందన్నారు. అలాగే అర్హత గల అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పిం చాలన్నారు.

# పొట్టి శ్రీరాములు వర్ధంతి

**విశాలాంధ్ర- కంచికచర్ల:** కంచికచర్ల శాఖా గ్రంధాలయం నందు అమరజీవి పొట్టి శ్రీరాములు 71 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి గ్రంధాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాల వేసి నివాళు లర్పించారు.

# అమరజీవికి నివాళులు

**విశాలాంధ్ర, కూచిపూడి :** అమరజీవి పొట్టి శ్రీరాములు 71 వ వర్ధంతి శు క్రవారం కూచిపూడి లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి యోగి కూచిపూడి కళా పీఠంలో నిర్వహించారు. కళా పీఠం ప్రిన్సిపల్ డాక్టర్. వేదాంతం రామలింగ శాస్త్రి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాసులు, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ్ శాస్త్రి, డాక్టర్ వేదాంతం వెంకట దుర్గాభవాని, లైబ్రేరియన్ వై వి ఫణికుమార్ జూనియర్ అసిస్టెంట్ఎస్. వెంకటేశ్వరరావు కళా పీఠం సిబ్బంది తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# 17న శ్రీనివాస కళ్యాణం

**విశాలాంధ్ర విజయవాడ కల్చరల్ :** స్నేహాలయ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 17వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ పండితులచే నవమి వార్షిక పుష్పయాగయుక్త శ్రీనివాస కళ్యాణం జరుగు తుందని సంస్థ వ్యవ స్థాపక కార్యవర్గ సభ్యుడు చిలుకోటి మురళి తెలిపారు. గాంధీ నగరం జింఖానా క్లబ్ సమీ పానగల కందుకూరి కళ్యాణ మంటపం ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన ముల వైఖానస ఆగమ శాస్త్ర పండితులు డాక్టర్ నారాయణ తనూజ విష్ణువర్ధ నాచా ర్యుల ఆచార్యత్వమున జరుగుతుందన్నారు.

**CHANGE OF NAME**
I Saride Jagan Mohana Rao (Old Name), S/o. S.M.Jayudu, R/o- D.No 29-28-1/31, 3rd Floor, Swama Glory Towers, Kowelamudi Vari Street, Suryaraopet, Vijayawada-520002 NTR Dt., A.P India, I Changed My Name Saride Jagan Mohan Rao (New Name) Hence forth I will be known as SARIDE JAGAN MOHAN RAO

## ఎన్ఎస్ఈ సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మొట్టమొదటి లిస్టింగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్ఎస్ఈ సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో భారతదేశం మొదటి లిస్టింగ్ జరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎండీ అండ్ సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్, సెబీ సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆర్ బాలసుబ్రమణియం, ఉన్నతి ఫౌండర్ డైరెక్టర్ రమేష్ స్వామి, సెబీ హోల్ టైమ్ మెంబర్ అశ్వనీ భాటియా తదితర ప్రముఖులు సమక్షంలో ఈ లిస్టింగ్ జరిగింది.

## రాష్ట్రంలో ఐసీఐసీఐ హోమ్ ఫైనాన్స్ కార్యకలాపాల విస్తరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని ప్రముఖ హెచ్ఎఫ్సి లలో ఒకటైన ఐసిఐసిఐ హెూమ్ ఫైనాన్స్ కంపెనీ, తన విస్తరణ ప్రణాళికల్లో భాగంగా కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కొత్త శాఖను ప్రారంభించింది. ఇది రాష్ట్రంలో 11వ శాఖ కాగా, మొత్తం మీద కంపెనీకి దేశవ్యాప్తంగా 200కు పైగా శాఖలున్నాయి. కంపెనీ స్థానిక కమ్యూనిటీకి విస్తృత శ్రేణి గృహ రుణాలు, గృహ అభివృద్ధి రుణాలు, కార్యాలయ ప్రాంగణం కోసం రుణాలు, గృహ ఈక్విటీ రుణాలు, లోన్ ఎగైనెస్ట్ ప్రాపర్టీ రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## స్టేజ్-4 న్యూరో ఎండోక్రిన్ క్యాన్సర్‌కు ఏవోఐలో విజయవంతంగా చికిత్స

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అత్యంత అరుదైన, తీవ్రమైన స్టేజ్-4 న్యూరో ఎండోక్రిన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు అమెరికన్ ఆంకాలజీ వైద్యులు విజయవంతంగా చికిత్స నిర్వహిస్తున్నారు. వినుకొండకు చెందిన 42 ఏళ్ల మహిళ తీవ్రమైన రోగ లక్షణాలతో మంగళగిరి ఏవోఐకి వచ్చారు. పరీక్షల అనంతరం సిగ్మోయిడ్ కోలన్‌లో అల్సెరోప్రొలిఫెరేటివ్ పెరుగుదల ఉన్నట్లు, బయాప్సీ ద్వారా గ్రేడ్-3 న్యూరో ఎండోక్రిన్ కార్సినోమాగా నిర్ధారించారు. ఏవోఐ మెడికల్ డైరెక్టర్, సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ ఎన్.సుబ్బారావు, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగాల ఆధ్వర్యంలో ఈ ఏడాది జులైలో పేషంటుకు చికిత్స ప్రారంభించారు. పేషెంటుకు మొత్తం ఆరు సైకిళ్ల కీమోథెరపీ అందించారు. నవంబరులో పీఈటీ సిటీ స్కాన్ చేయగా, వ్యాధి దాదాపు పూర్తి నిష్క్రియాత్మకంగా కనిపించింది. అత్యంత క్లిష్టమైన ఈ కేసులో విజయవంతంగా చికిత్సానందించడం ఏవోఐలో క్యాన్సర్ సంరక్షణ శ్రేష్ఠతను రుజువుచేస్తుంది.

## సెంట్రమ్ మల్టీ విటమిన్, ప్రోటీన్ పౌడర్‌ల శ్రేణికి కాజల్ అగర్వాల్‌తో ప్రచారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రపంచంలోనే నంబర్ వన్ మల్టీ విటమిన్ బ్రాండ్ సెంట్రమ్, భారతదేశంలో తన కొత్త శ్రేణి మల్టీ విటమిన్, ప్రోటీన్‌ల శ్రేణిని విడుదల చేసేందుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నటి కాజల్ అగర్వాల్‌ను ప్రకటించింది. ప్రతి 10 మంది భారతీయుల్లో 8 మంది మల్టీ విటమిన్ లోపంతో సమస్యలు ఎదుర్కొంటూ ఉండేందుకు అవకాశం ఉంది. కాజల్‌తో కలిసి సెంట్రమ్ క్యాంపెయిన్ సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను, పోషకాహార అంతరాలను భర్తీ చేసేందుకు ఆహారంతో పాటు మల్టీ విటమిన్‌లను చేర్చడాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది సెంట్రమ్ మద్దతుతో కాజల్ తన బహుళ పాత్రలను అంతరాయం లేకుండా నిర్వహించడాన్ని హైలైట్ చేస్తుంది.

## ఆగ్నేయాసియా దేశాలకు విస్తరించడంతో గ్లోబల్‌గా మారిన అపర్ణ ఎంటర్‌ప్రైజెస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ సామగ్రి తయారీదారు అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, యుపీవీసీ డోర్స్, విండోస్ బ్రాండ్, ఓకోటెక్‌తో వ్యూహాత్మకంగా ఆగ్నేయాసియా మార్కెట్‌లలోకి ప్రవేశించింది. ఉత్తర భారత మార్కెట్, భూటాన్‌లోకి విజయవంతంగా ప్రవేశించిన తర్వాత, వియత్నాం, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లలోకి అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ ప్రవేశించటంతో భవిష్యత్తులో ఓకోటెక్ యొక్క మొత్తం ఆదాయానికి 20 శాతం సహకరించవచ్చు. ప్రపంచ స్థాయిలో యుపీవీసీ తలుపులు, కిటికీల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చాలనే ఒక వ్యూహాత్మక లక్ష్యంతో ఈ విభిన్న మార్కెట్‌లలోకి కంపెనీ ప్రవేశించింది.

## మునుపెన్నడూ లేనంత మెరుగ్గా సోచ్ రెడ్ డాట్ సేల్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మునుపెన్నడూ లేనంత మెరుగ్గా సోచ్ రెడ్ డాట్ సేల్ తిరిగి వచ్చింది. వివిధ రకాల ఎత్నిక్ వేర్ లుక్‌లను 50 శాతం తగ్గింపుతో అందిస్తోంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రెడ్ డాట్ సేల్ నుండి, చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్‌లు, ట్యూనిక్స్, కఫ్తాన్‌లతో సహా అన్ని సోచ్ లుక్‌లను ఎంపిక చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి. ఈ ప్రత్యేక విక్రయం కేవలం షాపింగ్ అనుభవం మాత్రమే కాకుండా విస్తృత శ్రేణిలో 50 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. రెడ్ డాట్ సేల్ రూ. 749 నుండి ఎంపికల శ్రేణిని అందజేస్తుంది.

## ప్రభుత్వ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష : గోళ్ళ

విశాలాంధ్ర పెదపారుపూడి : ప్రభుత్వ పథకాలే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష అని ఆ పార్టీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ళ సోమేశ్వరరావు ఒక ప్రకటనలో గురువారం అన్నారు. గోళ్ళ మాట్లాడుతూ వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట 99 శాతం అమలు చేశారని అన్నారు. ఆ విధానంలోనే వృద్ధులకు పెన్షన్ అంచలవారీగా రూ.3000లు చేస్తానని ఇచ్చిన మాట జనవరి నుంచి నెరవేర్చుకోనున్నట్లు ఆయన వివరించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గతంలో కంటే అధిక భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని జోష్యం చెప్పారు. అడిగిందే అనువుగా ప్రజల కోసం పార్టీలకతీతంగా పనిచేసే వ్యక్తి ఎవరైనా ఉన్నా రంటే ఆ వ్యక్తి కైలేఅనిల్ కుమార్ అని వివరించారు.

## వసతి గృహ బాలికలకు రూ.25,000 విలువ చేసే వస్త్రాల వితరణ

విశాలాంధ్ర - మచిలీపట్నం : మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక నోబుల్ కాలనీలో గల ఏవిలిన్ (షార్కీ) గర్ల్స్ హాస్టల్ నందు ఉండే 45 మంది బాలికలకు బందరు హౌసింగ్ బోర్డ్ వాస్తవ్యులు డి.ధనరాజు విజయలక్ష్మి దంపతులు 25 వేల రూపాయల విలువ చేసే నూతన వస్త్రాలను బహుకరించడం జరిగింది. మైత్రీ ఫౌండేషన్ సభ్యురాలు భవాని ద్వారా హాస్టల్ బాలికల అవసరాలు తెలుసుకున్న దాతలు శుక్రవారం హాస్టల్‌కు విచ్చేసి స్వయంగా బాలికలకు నూతన వస్త్రాలు బహుకరించడం జరిగింది. ఈకార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు కె. వేణు కుమార్,గౌరవ సభ్యులు ఎంఎస్ ఎన్ విప్రసాద్, భవాని, అనిల్, పవన్, తేజ పాల్గొన్నారు.

## పాలసీదారులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

**- కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్**

విశాలాంధ్ర బ్యూరో - మచిలీపట్నం : పాలసీదారులను ఇబ్బంది పెడితే సహించేది లేదని కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీని హెచ్చరించింది. గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు 3 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుని మరణించగా, ఇన్సూరెన్స్ కంపెనీ చిన్న చిన్న అభ్యంతరాలు చూపించి డబ్బు ఇవ్వకపోవడంతో మృతిని భార్య కడబాల ధనలక్ష్మి మచిలీపట్నం చెందిన న్యాయవాది లంకి శెట్టి బాలాజీని ఆశ్రయించగా, బాలాజీ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారికి కృష్ణాజిల్లా వినియోగదారుల ఫోరం ద్వారా లీగల్ నోటీసులు ఇప్పించడంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అధికారులు శుక్రవారం ఆమెతో రాజీ చేసుకుని కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ మరియు సభ్యుల సమక్షంలో ఆరు లక్షల రూపాయల చెక్కును బాధితురాలకి అందించారు. బాధితురాలు లాయర్ బాలాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

# బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ

(విశాలాంధ్ర) పెడన : మోసపోయిన ఆంధ్రుడికి ఆశాదీపం పేదవారిని ధనవంతు లుగా మార్చే కార్యక్రమమే బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తున్న పథకాలు మహాశక్తి, యువ గళం, అన్నదాత, ఇంటింటికి నీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టూ రిచ్ అని నాలుగున్నర ఏళ్ళ తర్వాత ప్రజల సొమ్ముతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసే బస్సు యాత్ర, తుస్సు యాత్ర లను నమ్మి మోసపోయారని వేణుగోపాలరావు అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు తెలుగు దేశం పార్టీని గెలిపించి మళ్లీ బాబుని ముఖ్యమంత్రి ని చేయాలన్న తపన, ఆత్రుతతో ఉన్నారని అన్నారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు కమ్మగంటి వెంకటేశ్వరరావు (బాబు) వెలికట్ల ప్రసాద్, మల్ల. రమేష్, మోదుగుమూడి సాంబశివరావు, జగన్మోహన్ రావు, చిల్లిముంత. చిరంజీవి పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

(విశాలాంధ్ర) పెడన: రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్మరణీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అఖిలభారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా. కొల్లూరి చిన్నా అన్నారు. వాసవి ప్రార్థన మందిరం నందు పొట్టి శ్రీరాములు 71 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డా. చిన్నా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు, చిట్టూరి పశుపతినాథ్ బాబు కార్యదర్శి జవాజి నాగు సభ్యులు పాదర్తి శ్రీను తుమ్మలపల్లి సుధీర్ జల్లూరి సాంబ వాసవి క్షేత్రం ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు ముత్యాలమ్మ గుడి నిర్వాహకులు తోటపైడేశ్వరరావు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై అవగాహన

**జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల**

విశాలాంధ్ర అవనిగడ్డ : ఎన్నికల తుది జాబితా 2024 జనవరి 5వ తేదీన విడుదల చేయడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి డి పార్వతి దేవి అన్నారు. శుక్రవారం ఆమె అవనిగడ్డలో ఓటర్ల మార్పులు, చేర్పులు, ఇ.వి.ఎంల అవగాహన వంటి కార్యక్రమాలను ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ఓటర్ల మార్పులు, చేర్పులతో పాటు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 25 వ తేది వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని తుది జాబితా మాత్రం జనవరి 5 న విడుదల చేయడం జరుగుతుందని, నూతన ఓటర్ల చేర్పు మాత్రం నిరంతర ప్రక్రియ అన్నారు. రేషన్ దుకాణాలలో కంది పప్పు అందడం లేదు అన్న ప్రశ్నకు ఆమె సమాధనంగా పల్నాడు జిల్లా నుండి సరఫరా అవుతుందని, ఈ నెల నుండి కార్డు దారులందరికి అందిస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా ఓటు నమోదుకు ఇ.వి.ఎం లపై అవగాహన కూడా రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్నారని ఆమె చెప్పారు.

## ఆర్టీసీ కాలనీకి తాగు నీరు సరఫరా

విశాలాంధ్ర అవనిగడ్డ : ఏపిఎస్ఆర్టిసి వర్కర్స్ కోపరేటివ్ కాలనీలోని కాలనీ వాసులకు తాగు నీరు సరఫరా చేసేందుకు భూమి పూజ చేసి ప్రారంభించారు. కాలనీకి గతంలో మంచి నీటి పైపులు వేసేందుకు 2 లక్షల 1 వెయ్యి రూపాయలు బ్యాంక్ ద్వారా ఒంగోలు భగీరధ కంపెనీకి డిడి ద్వారా పంపడంతో పనులను శుక్రవారం సర్పంచ్ గౌరుముచ్చు ఉమా , ఎం.పి.పి తుంగల సుమతీదేవి, రాష్ట్ర యువజన కార్యదర్శి గాజుల జయగోపాల్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు లు పనులను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులరాలు కోట పుష్పావతి, కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, సొసైటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు మండలి వెంకటేశ్వరరావు, చందన వెంకటేశ్వరరావు, యుఎస్ఎస్ పి రావు లు పాల్గోని పనులను పర్యవేక్షించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్న సచివాల సిబ్బంది

విశాలాంధ్ర అవనిగడ్డ : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది స్వాధీనం చేసుకుంటున్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది తళాలు పగులకొట్టి ఆ యా కేంద్రాలను స్వాధీనం చేసుకునే పనులలో ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు టిడిపి, జనసేన నేతలు సంఘీభావం తెల్పడంతో సచివాలయ సిబ్బందిని అడ్డుకోవడంతో చిన్న చిన్న ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలో 30 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా గత 4 రోజులుగా పే స్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం మాత్రం అందించడం లేదు. తల్లులకు, బాలింతలకు మాత్రం రేషన్ 15 రోజులకు ఒక సారి ఇవ్వనుండటంతో మరో రెండు రోజులు మాత్రమే పౌష్టికాహారం అందనుంది. అంగన్‌వాడీల నిరసన హోరు మరో పక్క సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీలను స్వాధీనం చేసుకునే తరుణంలో ఘర్షణలు లేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించాం

**- ఎంఆర్వో వెంకటశివయ్య**

విశాలాంధ్ర - పెనమలూరు : మండలంలోని అన్నీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించామని ప్రజలు గమనించి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఆర్వో వెంకట శివయ్య తెలియజేశారు. గత మూడు రోజులుగా అంగన్‌వాడీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికై మహిళలకు, బాల లకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టిందన్నారు. కలక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 92 అంగన్‌వాడీ సెంటర్‌లను ఓపెన్ చేసి స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా మహిళా పోలీస్ ఆధ్వర్యంలో బాలిం తలకు, అర్హులైన తల్లులకు, పిల్లలకు ఫుడ్ పంపిణీ చేయడం జరిగిందని, పిల్లలతో బాలల తరగతులను నిర్వహించడం జరిగిందని తెలిపారు. మొదటి రోజు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శాస్త్రి

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులుగా కే.ఏ.వి.ఎస్.వి.ప్రసాద శాస్త్రి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జులై 22వ తారీకు నుంచి ఇన్చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నడి. సుధాకర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఇంటర్మీడియట్ బోర్డులో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా విధులు నిర్వహిస్తున్న శాస్త్రి ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీలపై విచ్చేశారు. నూతన ప్రిన్సిపాల్ ని కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## బిల్లుల జాప్యాన్ని నివారించండి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులకు సంబం ధించిన జాప్యాన్ని నివారించి, బిల్లులు వెంటనే ఆమోదం పొందేలా చూడాలని ఎస్టీయూ జిల్లా నాయ కులు కోరారు. ఈ మేరకు గుంటూ రు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎ.కిరణ్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా వైద్య సదుపాయం కల్పించడానికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక గది, ఓపీ సౌకర్యం, మైనర్ ఆపరేషన్లు, అవసరమైన చోట ప్రత్యేక వైద్య నిపుణులచే పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత మందులు తదితర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సూపరింటెండెంట్ గురు, శుక్ర, శనివారాలలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లచే ఒక సమావేశం ఏర్పాటు చేసి సంబంధిత వైద్య సేవలు అందేలా సమావేశంలో చర్చిద్దామని తెలియజేసినట్లు నాయకులు తెలిపారు.

## వార్షికోత్సవాలు విద్యార్థుల్లో ఉల్లాసాన్ని తీసుకొస్తాయి

విశాలాంధ్ర, కూచిపూడి : పాఠశాలలో నిర్వహించే వార్షికోత్సవ వేడుకలు విద్యార్థులలో ఆనందాన్ని ఉల్లాసాన్ని రేకెత్తిస్తాయని మొవ్వ తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, కూచిపూడి ఎస్సై డి సందీప్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన మొవ్వలోని హెూలీ స్పిరిట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు అధికారులు ఇద్దరు అతిధులుగాహాజరై ప్రసంగించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే క్రీడాపోటీలు విద్యార్థులలో పట్టుదలను పోటీ తత్వాన్ని, మానసికల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. విద్య, క్రీడలలో విజయతలైన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఫాదర్ జాకాబ్ ప్రసాద్, కరస్పాండెంట్ ఫిలోమినా, పి టి ఏ సభ్యుడు నరేంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులుచే నిర్వహించిన సాంస్కృతిక పోటీలు అబ్బురపరిచాయి.

## పది సంవత్సరాలు పూర్తిచేసుకున్న జీ తెలుగు ఓంకారం ఆధ్యాత్మిక ప్రయాణం

విశాలాంధ్ర -విజయవాడ లబ్బీపేట: జీ తెలుగు అత్యంత ప్రసిద్ధ ఆధ్యాత్మిక మరియు భక్తి కార్యక్రమాలలో ఒకటైన ఓంకారం విజయవంతంగా పదేళ్ళు పూర్తి చేసుకుందనీ సంస్థ ప్రతినిధులకు ప్రకటనలో తెలిపారు. ప్రేక్షకుల్లో భక్తిభావం నింపే ఓంకారం ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు.2003 డిసెంబర్ 12న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దేవిశ్రీ గురూజీ భక్తులకు ఆధ్యాత్మిక సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. ఓంకారం జ్యోతిషం మరియు ఆధ్యాత్మికత గురించి సమాచారాన్ని అందించే ఆధ్యాత్మిక కార్యక్రమంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ షోలో దేవిశ్రీ గురూజీ రామల శాస్త్రం ఆధారంగా జ్యోతిష్య పరిష్కారాలను అందిస్తున్నారన్నారు. డా.దేవిశ్రీ గురూజీ అందిస్తున్న 'ఓంకారం' కార్యక్రమం అత్యంత ప్రేక్షకాదరణ పొందడం నిజంగా సంతోషించదగిన విషయమన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయన వారికి సహాయం చేయండి

**-ప్రముఖ సామాజిక సంస్థ బాల రక్షా భారత్ పిలుపు**

విశాలాంధ్ర -విజయవాడ లబ్బీపేట: ఆంధ్రప్రదేశ్‌లో మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయన వారిసహాయం చేయాలని ప్రముఖ సామాజిక సంస్థ బాల రక్షా భారత్ పిలుపునిచ్చింది. మిచాంగ్ తుఫాను దక్షిణ భారతదేశంలో విధ్వంసానికి దారితీసిందన్నారు. ముఖ్యంగా పాండిచ్చేరి, తమిళనాడులోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని నాలుగు జిల్లాల్లో దాదాపు కోటి మంది ప్రజలు ప్రభావితమయ్యారన్నారు. ఈ ప్రభావిత ప్రాంతాలలో మా సహయ ప్రయత్నాలను కేంద్రీకరించాల్సిన తక్షణ అవసరాన్ని మేము గుర్తించాము మరియు బాల రక్షా భారత్‌లో మా లక్ష్యం పిల్లలు మరియు వారి కుటుంబాల శ్రేయస్సు భద్రతపై దృష్టి సారించడం, ఈ విపత్తు అనేక మంది బలహీనుల జీవితాలకు తక్షణ ముప్పును కలిగిస్తుంది. ప్రభావిత ప్రాంతాలు. బాల రక్షా భారత్ ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, నెల్లూరు మరియు తమిళనాడులోని తిరువల్లువర్, చెన్నై జిల్లాల్లో తక్షణ అవసరాలకు ప్రతిస్పందిస్తోందన్నారు. ఎంపిక చేయబడిన ప్రాంతాలు తీరప్రాంత జిల్లాలు, ఇక్కడ నీరు చొరబడటం వలన లోతట్టు ప్రాంతాలలో కూడా మౌలిక సదుపాయాల గృహాలు, గృహ మరియు విద్యా సామగ్రి దెబ్బతిన్నాయన్నారు.ప్రతి విరాళం, ఎంత చిన్నదైనా, బాధితులకు ఆహారం, స్వచ్ఛమైన నీరు ఆశ్రయం వంటి అవసరమైన సామాగ్రిని అందించడంలో మాకు సహాయం చేస్తుందన్నారు. అటువంటి సమయంలో చాలా బలహీనంగా ఉన్న పిల్లల శ్రేయస్సును నిర్ధారించడంపై ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. విరాళం, వివరాలు మరియు మా సహాయ చర్యలపై మరింత సమాచారం కోసం, దయచేసి మా వెబ్‌సైట్ %ఽఽఽ.ఝశ్రీతీఖఎంప్రుఎప్రుతీఫ్.శీతీస్త్ర%ని సందర్శించాలని కోరారు.

## శీతాకాలంలో ప్యాంట్రీని అమేజాన్ ఫ్రెష్ నింపుకొంటే 400 క్యాష్ బ్యాక్

విశాలాంధ్ర -విజయవాడ లబ్బీపేట : శీతాకాలం సమీపించడంతో, మీ ప్యాంట్రీని అవసరమైన కిరాణా సరుకులతో అమేజాన్ ఫ్రెష్ ఒక సౌకర్యవంతమైన విధానంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తాజా పండ్లు, కూరగాయలైన స్ట్రాబెర్రీస్, స్వీట్ స్వీట్ కార్న్, గుమ్మడి కాయ వంటి ఉత్పత్తులు అమేజాన్ ఫ్రెష్ వింటర్ స్టోర్ నుండి మీ ఇంటి వద్ద పొందమన్నారు. కొత్త కస్టమర్స్ తమ మొదటి నాలుగు ఆర్డర్స్ పై రూ.400 క్యాష్ బాక్ ఆఫర్స్ ను పొందవచ్చున్నారు. పానీయం.మరిన్ని వివరాల కోసం అమెజాన్ వెబ్సైట్ ను సందర్శించాలన్నారు.

## జాతీయ నాయకుల త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర-మంగళగిరి : జాతీ య నాయకులు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, అమ౦జీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ నివాళులర్పించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాలు సమర్పించి నమస్కరించారు. అనంతరం మౌనం పాటించి నివాళు లర్పించారు. జాతీయ నాయకుల త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్మరించారు.

## మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన

విశాలాంధ్ర-తాడి కొండ : తమ సమ స్యలను పరిష్కరిం చాలని కోరుతూ తాడి కొండ పోలీస్ స్టేషన్ సమీపంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం మోకాళ్ళపై నిరసన దీక్షలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. తాము గొంతె మ్మ కోరికలు కోరడం లేదన్నారు. తమ హక్కులను మాత్రమే అడుగుతు న్నామని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె.జగన్, షేక్ రిజ్వానా పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల మానవహారం, నిరసన

విశాలాంధ్ర-పొన్నూరు : న్యాయ మైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ పొన్నూరు పట్టణం అంబేద్కర్ సెంటర్‌లో పొన్నూరు అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం ప్రదర్శన గావించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి హామీలు నెరవేర్చేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. మండల సీఐటీయూ నాయకుడు నిమ్మకూరు రమేష్, అంగన్‌వాడీ నాయకులు డీపీ విజయలక్ష్మి, సుకన్య, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు వర్ధంతి

విశాలాంధ్ర-తెనాలి : అమ రజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతిని పురస్కరిం చుకొని తెనాలి పట్టణంలో అలంకార్ టాకీస్ సెంట ర్‌లో గల అమరజీవి కాంస్యవిగ్రహానికి పట్టణ ప్రముఖులు, నాయకులు, ఆర్యవైశ్య సంస్థలు, ప్రజలు పాల్గొని అమరజీవిని స్మరించుకొన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేయడానికి కూడా వెన్నుచూపని ఆయన దీక్ష పట్టుదల భావితరాలకు మార్గదర్శకం అన్నారు. నేటి తరం యువతన ఆయనను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో అనేక సంస్థల ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## 4వ రోజు అంగన్‌వాడీల సమ్మె

విశాలాంధ్ర, తెనాలి : అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. శుక్ర వారం అంగన్‌వాడి కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించి సమ్మె స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సమ్మె చేయాల్సిన అవ శ్యకతను నాయ కులు వివరించారు. ఎల్.ఐ.సి. నాయకులు వి.ఫ ణీంద్ర, కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ యూనిట్ నాయకులతో చర్చలు జరిగి సమ్మెను విరమింపజేయాలని కోరారు. శిశువులకు, గర్భిణీలకు నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం విచారకరమన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్బంద చర్యలకు పాల్పడుట సరికాదన్నారు. ముఖ్యమంత్రి యిచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఆణ చివేత చర్యలకు పూనుకోవడం సరికాదన్నారు. ధర్నాలో ఎ.వి.వి. కుమారి, రంగ, పుష్ప, చంద్రకళ, హైమావతి, ఎలిబెజ్ రాణి, జ్యోతి, రమాదేవి, అనూరాధ, పావని తదితరులు పాల్గొన్నారు.